క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీపీటీవో

బస్టాండ్(విజయవాడ పశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా పరిధిలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులకు మెరుగైన సేవలు కల్పించి వారి భద్రత ప్రమాణాలు పాటించే దిశగా ప్రయాణికుల నుంచి సలహాలు, సూచనలు, ఫిర్యాదులు స్వీకరించేందుకు డయల్ యువర్ డీపీటీవో (జిల్లా ప్రజారవాణా అధికారి) కార్యక్రమం చేపట్టినట్లు జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.ఏ సుదానం తెలిపారు. ప్రయాణికులు మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల మధ్య ఫోన్ నంబర్ 9959225446 కు ఫోన్ చేసి తమ సలహాలు, సూచనలు, ఫిర్యాదులు తెలియచేయాలని కోరారు.

స్కూల్‌కు స్థలం కేటాయించాలని వినతి




భవానీపురం(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లోని ఈద్గా మహల్లా నగర పాలక ప్రాథమికోన్నత ఉర్దూ పాఠశాలకు స్థలం కేటాయించాలని స్కూల్ ప్రధానోపాధ్యాయులు నయీం అహ్మద్, అబ్దుల్ హకీమ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డ్ అధ్యక్షుడు షేక్ గౌస్ మొహిద్దీన్‌కు సోమవారం సాయంత్రం వినతి పత్రం అందచేశారు. ప్రస్తుతం ఉన్న పాఠశాల విద్యార్థులకు స్థలం సరిపోని కారణంగా కొత్త విద్యార్థులు వచ్చే పరిస్థితి లేదని తెలిపారు. స్థానికంగా ఉన్న వక్ఫ్‌బోర్డ్ స్థలం కేటాయించాలని నయీం, హకీమ్‌లు విన్నవించారు. ఈ సందర్భంగా గౌస్ మొహిద్దీన్ మాట్లాడుతూ ఈ విషయాన్ని ప్రభుత్వం, వక్ఫ్‌బోర్డ్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

ఫార్మా రంగంలో ఉద్యోగ అవకాశాలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): కొత్తగా ఫార్మసీ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు ఆహ్వానిస్తూ సీనియర్ విద్యార్థులు నియోఫెస్టా 2కే24 పేరుతో నిర్వహించిన ఫ్రెషర్స్‌డే వేడుకలు సోమవారం సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో ఉత్సాహంగా ఉల్లాసంగా జరిగాయి. ఈ వేడుకల్లో డార్విన్ ఫార్ములేషన్స్ అధినేత డాక్టర్ డి.లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మారంగం ఇప్పటికే అభివృద్ధి చెందిందని, దేశ విదేశాల్లోనూ మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. విద్యార్థులందరూ కోర్సులోని మెలకువలపై మంచి పట్టు సాధించి భవిష్యత్తులో ముందుకు సాగాలన్నారు. ప్రిన్సిపాల్ ఎ.సునీత మాట్లాడుతూ ఆహ్లాదకరమైన వాతావరణంలో వినూత్న పద్ధతులతో వేడుకలు నిర్వహించిన సీనియర్ విద్యార్థులను అభినందించారు. అలాగే మంచి ర్యాంకులు సాధించి కళాశాలలో సీటు పొందిన వారు నైపుణ్యం గల అధ్యాపకుల, సీనియర్ విద్యార్థుల సలహాలు తీసుకుంటూ చక్కగా చదువుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో డాక్టర్ జి.రమణ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యపు రాచబాట వేటూరి పాట



విజయవాడ కల్చరల్: తెలుగు సాహిత్యపు రాచబాట వేటూరి పాట అని వేద గంగోత్రి వ్యవస్థాపకుడు డాక్టర్ వరప్రసాద్ అన్నారు. వేటూరి సాహితీ మిత్రులు ఆధ్వర్యంలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలోని వేటూరి విగ్రహం వద్ద సోమవారం సినీ గేయ రచయిత వేటూరి సుందరరామ మూర్తి జయంతి నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వరప్రసాద్ మాట్లాడుతూ నేటి తరం రచయితలు వేటూరి సాహిత్యాన్ని అధ్యయనం చేయాలని సూచించారు. పోలవరపు కోటేశ్వరరావు సాహితీపీఠం వ్యవస్థాపకుడు గోళ్ళ నారాయణరావు మాట్లాడుతూ తెలుగు పాటకు జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చిన మహనీయుడు వేటూరి అని కొనియాడారు. సినీ మాటల రచయిత బుర్రా సాయిమాధవ్, వేటూరి పాటల సాహిత్య పరిశోధకుడు డాక్టర్ జయంతి చక్రవర్తి, దామోదర గణపతిరావు, శ్రీనివాస్, చిట్టిబాబు, బోడి ఆంజనేయరాజు, రాజు, డాక్టర్ కాసుకొల్లు బాలకృష్ణ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట పోలీసులు సోమవారం ఓ వ్యక్తిని అరెస్టు చేసి 1.100 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జక్కంపూడి వైఎస్సార్ కాలనీ రైల్వే ట్రాక్ వద్ద గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో సెక్టార్ ఎస్‌ఐ జాన్‌బాషా రైల్వే ట్రాక్ వద్ద తనిఖీలు నిర్వహించగా కాలనీకి చెందిన కొర్రాయి సాయికృష్ణ అలియాస్ కుక్కల సాయి గంజాయిని విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సంక్షేమం, అభివృద్ధి అందించి ఓట్లు అడుగుతున్నాం

వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆసిఫ్

భవానీపురం(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు చేయటంతో పాటు ప్రజలకు వివిధ సంక్షేమ పథకాలు అందించి మరీ ఓటు అడుగుతున్నామని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ షేక్ ఆసిఫ్ తెలిపారు. భవానీపురం 41వ డివిజన్ 162 వార్డ్ సచివాలయం పరిధిలో కార్పొరేటర్ మహమ్మద్ ఇర్ఫాన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన పర్యటనలో ఆసిఫ్ ఇంటింటికీ వెళ్లి సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. తమకు అన్ని సంక్షేమ పథకాలు అందుతున్నాయని ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సంతోషం వ్యక్తం చేశారు. ఇంత మేలు చేస్తున్న జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షించారు. అందుకు తామంతా ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఆయనతోపాటు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

కరకట్ట ప్రాంతంలో ఇళ్లు కూల్చిన ఘనుడు చంద్రబాబు...

డివిజన్ పర్యటన అనంతరం షేక్ ఆసిఫ్ మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కృష్ణా పుష్కరాల పేరుతో భవానీపురం కరకట్ట సౌత్ రోడ్‌లోని పేదల ఇళ్లను కూల్చేసిన ఘనుడు చంద్రబాబు అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా 31 లక్షల మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత జగనన్నదన్నారు. గట్టు వెనుక ప్రాంతంలోని కొందరికి అమరావతిలో ఇళ్ల స్థలాలు కేటాయిస్తే కోర్టుకు వెళ్లి అడ్డుకున్న చంద్రబాబు పేదల ద్రోహి అని ధ్వజమెత్తారు. తమది ప్రజా ప్రభుత్వమని, కుల, మత, పార్టీ, వర్గాలకు అతీతంగా అందరికీ మేలు చేయటమే సీఎం జగన్ లక్ష్యమని తెలిపారు.



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఆసిఫ్, ఇర్ఫాన్, పార్టీ శ్రేణులు

ట్వంటీ ట్వంటీఫోర్ జగనన్న వన్స్‌మోర్...

భీమిలీలో ఇటీవల జరిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సభ జనసంద్రాన్ని తలపించిందని, అది చూసి ప్రతిపక్షాల వెన్నులో వణుకు పుట్టి ఏదేదో మాట్లాడుతున్నారని తెలిపారు. కరోనా కష్ట కాలంలో ప్రజలను ఆదుకుని నిలబడ్డ ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఆ సమయంలో హైదరాబాద్‌లో తలదాచుకున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు తమ మంచిచెడు చూస్తారంటే నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. నిత్యం ప్రజల అవసరాలను తెలుసుకుని వాటిని నెరవేర్చేది సీఎం జగనన్న అని తెలిపారు. ట్వంటీ ట్వంటీ ఫోర్ జగనన్న వన్స్‌మోర్ అంటూ ప్రజలు ఎలుగెత్తి చాటుతున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో 175/175 సాధించి తీరతామని, పశ్చిమంలో తన గెలుపుతో హ్యాట్రిక్ కొట్టి జగనన్నకు గిఫ్ట్‌గా ఇస్తానని స్పష్టం చేశారు.

ఇక్కడ ఆసిఫ్..అక్కడ జగనన్నను గెలిపించుకుంటాం

స్థానిక 41వ డివిజన్ కార్పొరేటర్ మహమ్మద్ ఇర్ఫాన్ మాట్లాడుతూ కరకట్ట ప్రాంతంలో ఉన్న నివాసితులు తమ ఇళ్లకు పట్టాలు అడుగుతున్నారని, దీనిపై గతంలోనే కలెక్టర్‌కు ఒక నివేదికను ఇచ్చామని తెలిపారు. త్వరలో ఈ సమస్యను పరిష్కరిస్తామని కూడా ఆయన చెప్పారని పేర్కొన్నారు. వరదలు వస్తే నదీ తీరాన ఉన్న కరకట్ట ప్రాంతం ముంపుకు గురవుతుందని, కృష్ణలంకలో మాదిరిగా ఇక్కడ కూడా రిటైనింగ్‌వాల్ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారని తెలిపారు. స్థానిక స్వాతి సెంటర్‌లో కల్వర్ట్ నిర్మిస్తున్నామని, దాంతో డ్రెయినేజీ సమస్యకు పరిష్కారం లభిస్తుందని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో ఇక్కడ ఆసిఫ్‌ను అక్కడ జగనన్నను గెలిపించుకుంటామని స్పష్టం చేశారు.

కార్యక్రమంలో కార్పొరేటర్లు యలకల చలపతిరావు, మరుపిళ్ల రాజేష్, పార్టీ నాయకులు అబ్దుల్ రెహమాన్, ఎండీ ఇషాక్, ఎండీ గౌసీ, ఎస్‌కె నసీమ, క్వాలిటీ ఖాదర్, జోసఫ్ శివమణి, బంకా చాముండేశ్వరి, గోదావరి బాబు, షబ్బీర్, ఫారూఖ్, లాజర్, జె ఆనంద్, కుమార్, అజిత్, అల్లాభక్షు, కామళ్ల జోజి, యరజర్ల మురళి, సర్తాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ కళాశాల విద్యార్థినులకు సీఎస్సార్ స్కాలర్‌షిప్స్



స్కాలర్‌షిప్స్ పొందిన ఉర్దూ కళాశాల విద్యార్థినులతో మేయర్ భాగ్యలక్ష్మి

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం కబేళా వద్దగల ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాలలో చదువుతున్న 21 మంది విద్యార్థినులకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్ఆర్) స్కాలర్‌షిప్స్ లభించాయి. ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న పేద, మెరిట్ విద్యార్థినులకు మలబార్ గోల్డ్ షోరూం తమ సామాజిక బాధ్యతగా ప్రతి ఏడాది స్కాలర్‌షిప్‌లు ఇస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో సోమవారం సిద్ధార్థ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ ఉర్దూ కళాశాలకు చెందిన ఐదుగురు మెరిట్ విద్యార్థినులకు ఒకొక్కరికి రూ.10 వేలు చొప్పున, 16 మంది విద్యార్థినులకు ఒకొక్కరికి రూ.8 వేలు చొప్పున మొత్తం రూ.1,78,000 స్కాలర్‌షిప్‌లు అందచేశారు. ఈ సందర్భంగా ఉర్దూ కళాశాల ప్రిన్సిపాల్ హఫీజ్ షేక్ అహ్మద్ మాట్లాడుతూ వరుసగా 8వ సంవత్సరం విద్యార్థినులకు ఆర్థిక సహాయం అందచేస్తూ వారికి అండగా నిలిచిన మలబార్ గోల్డ్ షోరూం చైర్మన్ ఎండీ పఠాన్ అహ్మద్‌కు ధన్యవాదాలు తెలిపారు. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆలోచనశక్తితో నూతన ఆవిష్కరణలు

ఇస్రో రిటైర్డ్ అసోసియేట్ డైరెక్టర్ శేషగిరిరావు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): యువత తమలోని ఆలోచనా శక్తిని పెంపొందించుకోవడంతో పాటుగా కొత్త ఆవిష్కరణలు చేయాలనే కుతూహలాన్ని పెంపొందించుకోవాలని 'ఇస్రో' అసోసియేట్ డైరెక్టర్ (రిటైర్డ్) డాక్టర్ వి.శేషగిరిరావు చెప్పారు. పీబీ సిద్ధార్థ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలోని వెబ్‌నార్ హాలులో రీసెంట్ ఇన్నోవేషన్స్ ఇన్ కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ–2024 పేరుతో సోమవారం సదస్సు నిర్వహించారు. ఆన్‌లైన్ ద్వారా శేషగిరిరావు విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు.

కృత్రిమ మేధస్సు ద్వారా సాంకేతిక పరిజ్ఞాన రంగం కొత్త ఆవిష్కరణలు జరుగుతాయని చెప్పారు. యువత తమలోని ఆలోచనా శక్తిని పెంపొందించుకోవడం ద్వారానే నూతన ఆవిష్కరణలు సాధ్యమని తెలిపారు. సదస్సుకు మరో అతిథిగా హాజరైన ఎఫ్ ట్రానిక్స్ సీఈవో దాసరి రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు చదువుకునేటప్పుడు బేసిక్ ప్రోగ్రామింగ్స్, ల్యాంగేజస్‌తో పాటుగా అల్గారిథమ్స్‌లో పట్టు సాధించాలని సూచించారు. సదస్సు కన్వీనర్, సిద్ధార్థ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ టీఎస్ రవికిరణ్ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఏ విధమైన నూతన ఆవిష్కరణలు చేయవచ్చుననే అంశాలపై విద్యార్థులకు అవగాహనకు ఈ సదస్సు ఎంతగానో దోహదం చేస్తుందని పేర్కొన్నారు. వివిధ ప్రదేశాలను నుంచి ప్రముఖ కంపెనీలకు చెందిన వారు ఆన్‌లైన్ ద్వారా హాజరయ్యారు. కళాశాల డీన్ రాజేష్ సి.జంపాల, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్, అధ్యాపకులు జి.సామ్రాట్‌కృష్ణ, కె.సుధీర్, కె.ఉదయశ్రీతో పాటుగా విద్యార్థులు పాల్గొన్నారు.



దాసరి రామకృష్ణను సత్కరిస్తున్న డీన్ రాజేష్, ప్రిన్సిపాల్ ఎం.రమేష్, టీఎస్ రవికిరణ్

నేడు వీఎంసీ కౌన్సిల్ సమావేశం

- 100 ప్రతిపాదనలతో ఎజెండా
- 12 అంశాలపై ప్రశ్నోత్తరాలు
- ఉదయం 10.30 గంటలకు కౌన్సిల్ ప్రారంభం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ప్రణాళికాబద్ధంగా తీసుకోవాల్సిన చర్యలపై మంగళవారం వీఎంసీ సర్వసభ్య సమావేశం జరగనుంది. మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో ఉదయం 10.30 గంటలకు జరిగే ఈ సమావేశంలో మొత్తం 100 అంశాలు ఎజెండాలో ప్రతిపాదనకు రాగా 12 ప్రశ్నలు ప్రశ్నోత్తరాల్లో సభ్యులు అధికారులను ప్రశ్నించనున్నారు.

ప్రధానాంశాలు...

- వీఎంసీ సర్కిల్–3 పరిధిలోని 22వ డివిజన్‌లో ఉన్న దోభీ ఘాట్ డీపీ స్టేషన్ నుంచి సీవర్‌లైన్ వరకు ఉన్న యూజీడీ లైన్ లీకులు కారణంగా తాగు నీరు కలుషితమవుతున్న నేపథ్యంలో స్థానికంగా మినీ ఎస్టీపీ నిర్మించాలని, ఇందుకు అయ్యే రూ. 98.62 లక్షలు వ్యయాన్ని కార్పొరేషన్ జనరల్ ఫండ్స్ నుంచి నిధులు కేటాయించాలని వచ్చిన ప్రతిపాదనపై కౌన్సిల్ సభ్యులు నిర్ణయం తీసుకోనున్నారు.
- నగరంలో వీధి కుక్కల బెడద అధికంగా ఉన్నందున వాటికి యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) నిర్వహించేందుకు హైదరాబాద్‌కు చెందిన నవోదయ వెట్ సొసైటీకి మూడేళ్ల పాటు ఏబీసీ ఆపరేషన్స్ నిర్వహించేందుకు, ఇందుకు ఒక్కో కుక్కకు రూ. 1500 చెల్లింపులు కార్పొరేషన్ సాధారణ నిధుల నుంచి ఖర్చు చేయాలని వచ్చిన ప్రతిపాదనపై కౌన్సిల్ సభ్యులు నిర్ణయం తీసుకోనున్నారు.
- విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం 24వ డివిజన్ పరిధిలోని 7, 92వ సచివాలయం ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం కాంప్లెక్స్‌పైన ఉండటంతో స్థానికులు అవస్థలు పడుతున్నారని, ఇందుకు ప్రత్యామ్నాయంగా ఇదే డివిజన్‌లోని ఆర్సీఎం చర్చి రోడ్డులో ఉన్న ఖాళీ స్థలంలో సచివాలయాలకు భవనం నిర్మించాలని స్థానిక కార్పొరేటర్ కుక్కల అనిత ప్రతిపాదించారు.



- విజయవాడ నగరపాలక సంస్థ తరఫున యువజనోత్సవాలు నిర్వహించాలని ట్రాఫిక్ అండ్ స్పోర్ట్స్ స్పెషల్ కమిటీ చైర్‌పర్సన్, 21వ డివిజన్ కార్పొరేటర్ పుప్పాల నర్సకుమారి కౌన్సిల్‌కు ప్రతిపాదించారు.

ప్రశ్నోత్తరాలు.....

- నగరంలోని ఒకే డోర్ నంబరుతో రెండు తాగునీటి పన్నులు ఉన్నాయని, అలాంటి నగర వ్యాప్తంగా ఎన్ని ఉన్నాయని కౌన్సిల్ సభ్యులు ప్రశ్నోత్తరాల్లో ప్రస్తావించనున్నారు.
- వీఎంసీకి రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్, ఎస్టేట్స్, ప్రజారోగ్య విభాగంకు రావాల్సిన ఆదాయం, ఆస్తులు, ఉన్న కేసులు, తీసుకున్న చర్యలపై సభ్యులు ప్రశ్నించనున్నారు.
- నగరంలో మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకున్న ఆయా సంస్థల యజమానులు భూగర్భ జలాలను వినియోగించుకుంటున్నందున కార్పొరేషన్‌కు పన్నులు చెల్లిస్తున్నారా?, నగరంలో అధికారిక, అనధికారిక వాటర్ ప్లాంట్లు ఉన్నాయని సభ్యులు ప్రశించనున్నారు.

స్పందన వినతులకు శాశ్వత పరిష్కారం

పటమట(విజయవాడ తూర్పు): ప్రజల నుంచి అర్జీ అందుకోవటంతో పాటు సమస్యకు సంతృప్తికరమైన పరిష్కారం చూపాలని, అధికారులు ఈ మేరకు ప్రణాళికలు అమలు చేయాలని విజయవాడ నగర పాలక సంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కార్పొరేషన్‌లో సోమవారం నిర్వహించిన స్పందనలో వినతులు స్వీకరించారు. అధికారులు ప్రజల సమస్యలను పూర్తిగా అర్థం చేసుకుని వాటిని క్షుణ్ణంగా చదివి అంతిమ పరిష్కారం అందించాలని సూచించారు. సమస్య పరిష్కారం కాకపోతే అందుకు గల కారణాలను అర్జీదారులకు తెలియజేయాలని స్పష్టం చేశారు. అభివృద్ధి లక్ష్యాల సాధనకు రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్ రెడ్డి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని పేర్కొన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను సక్రమంగా వినియోగించుకొని స్పందన వినతులపై ప్రతి రోజు సమీక్ష నిర్వహించి త్వరితగతిన పరిష్కారం చూపాలని తెలిపారు. మొత్తం 19 వినతులు రాగా అందులో ఇంజినీరింగ్ విభాగంపై 10, పట్టణ ప్రణాళిక విభాగంపై – 6, పట్టణ సామాజికాభివృద్ధి విభాగంపై – 1, ఉద్యానవన విభాగంపై–1, ఎస్టేట్స్ విభాగంపై–1 అర్జీ ఉన్నాయి. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ (జనరల్) కె. శకుంతల, అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి, చీఫ్ ఇంజినీర్ ఎం. ప్రభాకర్ రావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ పి రత్నావళి, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) డి.వెంకటలక్ష్మి, డెప్యూటీ సిటీ ప్లానర్ జూబిన్ చీరన్ రాయ్, పీఓయూసీడీ రోహిణి, ఎస్టేట్ ఆఫీసర్ శ్రీనివాస్, అకౌంట్ ఆఫీసర్ నరసింహమూర్తి, ఆర్ఎఫ్ఓ వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భవానీపురం(విజయవాడపశ్చిమ): కబేళా విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో 11 కేవీ విద్యాధరపురం ఫీడర్ మరమ్మతుల కారణంగా కొన్ని ప్రాంతాల్లో మంగళవారం రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యాధరపురం లేబర్‌కాలనీ, ఆర్టీసీ డిపో, భారత్ గ్యాస్ కంపెనీ రోడ్, అప్పలస్వామి క్వారీ, కేసీ పబ్లిక్ స్కూల్ రోడ్, చెరువు సెంటర్, కొండబడి, చిన్న సాయిబాబా టెంపుల్ తదితర ప్రాంతాల్లో కరెంట్ నిలిపి వేయనున్నట్లు వివరించారు. వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖతో సహకరించాలని కోరారు.

నూతన భవనంలో రెండో అంతస్తు ప్రారంభం

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో నూతనంగా నిర్మించిన రెండవ అంతస్తును సోమవారం సాయంత్రం నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఈ భవనం ఒక నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో నూతన భవన నిర్మాణమే కాకుండా ప్రారంభోత్సవం కూడా జరుగుతుందన్నారు. ఈ రెండవ అంతస్తులో ప్రణాళిక విభాగం, రెవెన్యూ డిపార్ట్‌మెంట్, పీఓ యుసీడీ, హార్టీకల్చర్, పౌరసంబంధాల శాఖ, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, సిబ్బందికి కేటాయించామని వివరించారు. కార్పొరేషన్ కార్యాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బంది పడకుండా రిసెప్షన్ డెస్క్, వెయిటింగ్ హాల్ ఏర్పాటు చేశామని చెప్పారు. పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ నగరపాలక సంస్థ నూతన భవనం కార్యాలయం కార్పొరేట్ స్థాయిలో అధునాతన టెక్నాలజీతో ఉందని చెప్పారు. నగరపాలక సంస్థ 2019 నుంచి రోడ్లు, డ్రెయినేజీ, వాటర్ ట్యాంక్‌లు నిర్మాణం, పార్కులు వంటి ఎన్నో అభివృద్ధి పనులు చేసిందని పేర్కొన్నారు. కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ రూ. 338.77 లక్షలతో నిర్మించిన రెండవ అంతస్తు ఎంతో టెక్నాలజీ కలిగి ఉందని తెలిపారు. ఆటోమేటిక్ ఎలక్ట్రిసిటీ సిస్టమ్ ద్వారా విద్యుత్ ఖర్చు తక్కువ అవుతుందన్నారు. ఎక్కువగా గ్లాస్ వాడటం వలన వెలుతురు బాగా ఉండటంతో విద్యుత్ ఆదా చేసే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, అవుతు శైలజ రెడ్డి, అడిషనల్ కమిషనర్లు శకుంతల (జనరల్), కేవీ సత్యవతి (ప్రాజెక్ట్స్), చీఫ్ ఇంజినీర్ ప్రసాద్, డీసీపీ సుబిన్, డీసీఆర్ డి. వెంకట లక్ష్మి, పీఓ యూసీడీ రోహిణి, ఏడీహెచ్ శ్రీనివాసులు, వీఏఎస్ డాక్టర్ రవిచంద్, ఈఈ వెంకటేశ్వరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



శిలాఫలకం వద్ద భాగ్యలక్ష్మి, వెలంపల్లి, స్వప్నిల్ దినకర్ తదితరులు

వాసవీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

భవానీపురం(విజయవాడపశ్చిమ): అభాగ్యులను అక్కున చేర్చుకుని ఆత్మీయతానురాగాలతో పలకరిస్తే వారికి స్వాంతన చేకూరుతుందని, సమాజ హిత సేవా సంకల్పాలే క్లబ్ మనుగడకు దోహదం చేస్తుందని వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. వాసవి క్లబ్ విజయవాడ విద్యాధరపురం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం విద్యాధరపురంలోని కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో జరిగింది. క్లబ్ గవర్నర్ సతీష్ కుమార్ నూతన కార్యవర్గం సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్యఅతిథిగా హాజరైన హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా సేవలందించడమే వాసవి క్లబ్‌ల లక్ష్యమన్నారు. ఆ దిశగా సేవా కార్యక్రమాలను రూపొందించుకోవాలని సూచించారు. క్లబ్ నూతన కార్యవర్గ అధ్యక్ష, కార్యదర్శులుగా కందేపు ప్రవీణ్ కుమార్, సీహెచ్ సాంబమూర్తి, కోశాధికారిగా నాగ రమేష్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా పేద మహిళలకు చీరెలు పంపిణీ, ఆలంబన పేరుతో వృద్ధాప్య పింఛన్లు, నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఇమ్మడిశెట్టి సురేష్‌బాబు, శ్రీధర్, పొట్టి శివకుమార్, చెన్నకేశవులు, శివప్రసాద్, విజయకుమార్, రమణ తదితరులు పాల్గొన్నారు.

గణపతికి పంచామృత అభిషేకాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సంకట హర చతుర్థిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై సోమవారం వినాయకుడికి పంచామృత అభిషేకాలు, విశేష అర్చనలు నిర్వహించారు. ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ఆలయం సమీపంలోని యాగశాలలో ఉదయం గణపతికి ఆలయ అర్చకులు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పూజా కార్యక్రమాలు, గణపతి హోమం నిర్వహించగా పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. ప్రతి మాసంలో పౌర్ణమి తర్వాత వచ్చే చవితిని సంకట హర చతుర్థిని నిర్వహిస్తామని అర్చకులు పేర్కొన్నారు. పూజలో పాల్గొన్న భక్తులకు ప్రత్యేక క్యూలైన్ మార్గం ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

వరసిద్ధి వినాయకుడికి పంచామృత అభిషేకాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఆంజనేయవాగు సెంటర్‌లోని వీరాంజనేయ స్వామి దేవస్థాన ఆవరణలోని వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో సోమవారం సంకట హర చతుర్థిని పురస్కరించుకుని స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున స్వామి వారికి సుప్రభాత సేవ అనంతరం పంచామృత అభిషేకాలు, అర్చన చేశారు. స్వామి వారికి ఆలయ అర్చకులు విన్నకోట శ్రీనివాసరావు శర్మ పూజలు చేశారు. పలువురు ఉభయదాతలు, భక్తులు తమ నామగోత్రాలతో పూజలు జరిపించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ ఈవో రావూరి వెంకటేశ్వరరావు, చైర్మన్ నందిపాటి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

కయాకింగ్ జాతీయ పోటీలకు తన్విత్



విజయవాడస్పోర్ట్స్: కానోయింగ్, కయాకింగ్ సబ్‌జూనియర్, జూనియర్ జాతీయ పోటీలకు విజయవాడ క్రీడాకారుడు ఎం.తన్విత్ ఎంపికయ్యాడు. ఇటీవల విజయవాడలో జరిగిన ఎంపిక పోటీల్లో అత్యంత క్రీడా నైపుణ్యం ప్రదర్శించి 200 మీటర్ల జూనియర్స్, 500 మీటర్ల సబ్ జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఫిబ్రవరి తొమ్మిది నుంచి 12వ తేదీ వరకు జరిగే మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్‌లో జరిగే జాతీయ పోటీలకు రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించనున్నాడు. జాతీయ పోటీలకు ఎంపికైన తన్విత్‌ను కయాకింగ్ సంఘం కార్యదర్శి జగదీష్ అభినందించారు.